సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

90324 97123

నంబర్‌ను సంప్రదించండి

ఆడబిడ్డ నిధి ఎక్కడ?



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేస్తామని చెప్పిన ఆడబిడ్డ నిధి కరపత్రం

- ఇచ్చిన హామీ అమలుకు నోచుకోని వైనం
- నియోజకవర్గంలో 60 వేల మంది మహిళల నిరీక్షణ



దాబాగార్డెన్స్: సూపర్ సిక్స్ సూపర్ హిట్ అన్నారు. అనంతపురంలో ఉత్సాహంగా విజయోత్సవం నిర్వహించారు. నేతలంతా ప్రసంగాలతో ఊదరగొట్టారు. సూపర్ సిక్స్‌లో ఉన్న మరో పథకం ఆడబిడ్డ నిధి.. అదే మహాశక్తి పథకం. ఆ పథకం ఎక్కడంటూ మహిళలు ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల ముందు కూటమి నాయకులు మహిళలకు ప్రతి నెలా రూ.1500 చొప్పున ఏడాదికి రూ.18 వేలు ఇస్తామని ప్రకటించారు. అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నా ఆ పథకం ఊసే లేదు. ఎన్నికల ముందు కూటమి పెద్దలు ఇచ్చిన హామీని నెరవేర్చకపోవడంతో మహిళలంతా మండిపడుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజలను మోసం చేయడంలో దిట్టని చెప్పడానికి ఇదో నిదర్శనమంటున్నారు.

గత ప్రభుత్వ హయాంలో మహిళలకు పెద్దపీట..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి అందేవి. అన్ని వర్గాల ప్రజలు ఏదో విధంగా లబ్ధి పొందేవారు. మహిళలకు ఆర్థిక చేయూతనందించేందుకు అప్పటి ప్రభుత్వం వారి ఖాతాలోనే నేరుగా డబ్బులు జమ చేసింది. అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, ఈబీసీ నేస్తం, కాపు నేస్తం, సున్నా వడ్డీ, వైఎస్సార్ చేయూత వంటి ముఖ్యమైన పథకాలను అమలు చేస్తూ మహిళల ఖాతాల్లో డబ్బులు జమ చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా.. ఆడబిడ్డ నిధి పథకానికి సంబంధించి ప్రస్తావనే లేకపోవడంతో పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి. 19 నుంచి 59 ఏళ్లలోపు మహిళలకు నెలకు రూ.1500 వంతున ఏడాదికి రూ.18 వేలు చెల్లించాల్సి ఉంది. మహిళలు ఆడబిడ్డ నిధిని ఎప్పుడు అమలు చేస్తారో తెలియక అయోమయంలో ఉన్నారు.

నియోజకవర్గ పరిధిలో..

దక్షిణ నియోజకవర్గ పరిధిలో 19 నుంచి 59 ఏళ్లలోపు వారు సుమారు 60 నుంచి 70 వేల మంది ఉంటారని అంచనా. వీరికి ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1500 చొప్పున ఏడాదికి రూ. 18 వేలు చెల్లించాల్సి ఉంది. అంటే ఇప్పటికే లబ్ధిదారులకు కోట్లల్లో బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఆడబిడ్డ నిధిపై ప్రకటన చేస్తారని అక్కచెల్లెమ్మలు ఆశగా ఎదురు చూశారు. ప్రభుత్వం ఏర్పడి దాదాపు ఏడాదిన్నర కావస్తున్నా ఇప్పటికీ ఎలాంటి స్పష్టత ఇవ్వలేదని, ఆడపడుచులకు నిరాశే మిగిల్చారని వాపోతున్నారు.

మహిళలే మహరాణులన్నారు..

కుటుంబంలో మహిళలే మహరాణులు.. మహిళలు ఆర్థికంగా ఎదిగితే ఆ కుటుంబం బాగుంటుందని.. సమాజం అభివృద్ధి చెందుతుందని కూటమి నాయకులు ప్రకటనలు గుప్పించారు. ఇంట్లో ఎంత మంది ఉంటే అంత మందికి ఆడబిడ్డ నిధిని అమలు చేస్తామని ఎన్నికల ముందు ప్రకటించారు. ఇంత వరకూ ఆ దిశగా అడుగులు పడకపోవడంతో మహిళలు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు.

ఏడాదిన్నర దాటినా..



ఆడబిడ్డ నిధి పథకం కింద నెలకు రూ.1500 ఇస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నరయినా ఇంత వరకూ ఆ పథకాన్ని అమలు చేయలేదు. ఈ పథకం అమలై ఉంటే మహిళలకు రూ.18 వేలకు పైగా డబ్బులు జమయ్యేవి. ఈ పథకాన్ని వెంటనే అమలు చేయాలి. మహిళకు ఆర్థిక తోడ్పాటు అందించాలి.

– మేడిసెట్టి రూప, పాతనగరం

వెంటనే ఇవ్వాలి..



మహిళలకు ఆర్థికంగా చేయూతనిస్తామని ఎన్నికల ముందు చెప్పిన కూటమి నాయకులు ఆ పథకాన్ని వెంటనే అమలు చేయాలి. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ రూ.1500 జమ చేయాలి. గడచిన నెలలకు కూడా కలిపి ఇవ్వాలి. ఆర్థికంగా ఆదుకుంటారనే నమ్మకంతో ఓట్లు వేశాం. వెంటనే ఆడబిడ్డ నిధి ఇవ్వాలి.

– చందక సునీత, మహారాణిపేట

ఎదురు చూపులేనా..



ఆడబిడ్డ నిధి కోసం ఎదురు చూస్తున్నాం. ఈ పథకాన్ని వెంటనే అమలు చేయాలి. మహిళలకు ఆర్థిక తోడ్పాటు అందించాలి. మహిళల ఖాతాలో డబ్బులు జమ చేస్తే కుటుంబాలను ఆదుకున్నట్టు అవుతుంది. వెంటనే ప్రభుత్వం స్పందించి ఆడబిడ్డ నిధులు విడుదల చేసి అర్హత ఉన్న ప్రతి మహిళకు అందించాలి.

– వాసుపల్లి బంగారమ్మ, పాతనగరం

మాట నిలబెట్టుకోవాలి..



కూటమి ప్రభుత్వం ఏర్పడి దాదాపు ఏడాదిన్నర కావస్తోంది. గత దసరా పండగ చూసాం. మరో దసరా వచ్చేసింది. ఆడబిడ్డ నిధి కోసం ఎదురు చూస్తున్నాం. ప్రభుత్వం ఇచ్చిన హామీని పక్కాగా అమలు చేసి, ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి. తక్షణమే ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి అర్హులైన మహిళలకు ఆడబిడ్డ నిధి ఖాతాల్లో వేయాలి.

– కొండ్రి సంతోషి, మహారాణిపేట

హామీని విస్మరించారు..



మహిళలే మహరాణులన్నారు. ఆడబిడ్డ నిధి ద్వారా ప్రతి నెలా అర్హులైన ప్రతి మహిళకు రూ.1500 వేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చారు. మహిళలందరూ ఓట్లేసి గెలిపించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం మరిచింది. ఇది కరెక్టు కాదు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఆడబిడ్డ నిధి పక్కాగా అమలు చేయాలి.

– కొణతాల కృష్ణవేణి, అస్సాంగార్డెన్స్

క్లుప్తంగా

కుటుంబం చెంతకు ఇండోర్ మహిళ

అల్లిపురం: మధ్యప్రదేశ్ రాష్ట్రం, ఇండోర్, లునియపుర గ్రామానికి చెందిన హేమలత (60) 20 ఏళ్లుగా మానసిక వ్యాధితో బాధపడుతోంది. కొడుకు, కోడలి దగ్గర ఉండేది. ఇండోర్ ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందించారు. అయినా వ్యాధి నయం కాలేదు. ఈ నేపథ్యంలో ఆమె ఇల్లు వదిలి వైజాగ్ వచ్చేసింది. రైల్వే స్టేషన్‌లో తిరుగుతున్న ఆమెను ఏయూటీసీ సిబ్బంది గుర్తించి టీఎస్‌ఆర్ మహిళా షెల్టర్ హోంలో ఆశ్రయం కల్పించారు. 6 నెలల చికిత్సతో ఆమె కోలుకుని కుటుంబ సభ్యుల వివరాలు తెలిపింది. దీంతో శ్రద్ధా ఫౌండేషన్ వలంటీర్లు హేమలతను వైజాగ్ నుంచి నేరుగా ఇండోర్ తీసుకెళ్లి కొడుకు రబీంద్రకు క్షేమంగా అప్పగించడమే కాకుండా ప్రతినెలా పోస్ట్ ద్వారా పంపే మందులు వాడే విధానం వివరించారు. దీంతో తమ తల్లి వ్యాధి నయం చేయించి తీసుకొచ్చి అప్పగించినందుకు ఏయూటీడీ, శ్రద్ధా సంస్థకు హేమలత కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

11న గ్లో అప్ గాల, 12న గ్లామ రన్‌వే షో



కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

దాబాగార్డెన్స్: సిరి మేక్ ఓవర్ స్టూడియోస్ ఆధ్వర్యంలో వచ్చే నెల 11న గ్లో అప్ గాల, 12న గ్లామ రన్ వే షో నిర్వహించనున్నట్టు నిర్వాహకురాలు సౌమ్య తెలిపారు. ఈ మేరకు బుధవారం ద్వారకానగర్ సంస్థ కార్యాలయంలో కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరించారు. అంతర్జాతీయ ఈవెంట్ దర్శకుడు వీరుమామ పర్యవేక్షణలో అద్భుతంగా ఈవెంట్లను రూపొందిస్తున్నామని, అక్టోబర్ 11న మేకప్ అవార్డ్స్, ఫ్యాషన్ అవార్డ్స్ మగువలకు, పిల్లలకు గ్లామర్ రన్ వే షో చేస్తున్నందుకు చాలా ఆనందంగా ఉందని, ఇప్పటి వరకు విశాఖలో సుమారు 70 మంది మేకప్ ఆర్టిస్టులను తయారు చేశామన్నారు. ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సు కూడా అందరికీ అందుబాటులోకి తీసుకొస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో అంతర్జాతీయ ఈవెంట్ మేనేజర్ వీరుమామ, సిరి మేక్ ఓవర్ అధినేతలు సౌమ్య, సుధ పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం అంతర్జాతీయ స్థాయిలో పలు విభాగాల్లో విజేతలుగా నిలిచిన మోడల్స్‌చే ర్యాంప్ వాక్ ఆకట్టుకుంది.

8వ వేతన సంఘం కమిటీ ఏర్పాటుకు వినతి



కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

అల్లిపురం: ఎనిమిదవ వేతన సంఘం కమిటీని ఏర్పాటు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఐఎన్‌సీ మజ్దూర్ సంఘ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం విశాఖ వచ్చిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు సంఘం నేతలు వినతి పత్రం అందజేశారు. బీఎంఎస్, బీపీఎంఎస్ అనుబంధ ఐఎన్‌సీ సంఘం గౌరవాధ్యక్షుడు పైలా దేముడునాయుడు, ప్రధాన కార్యదర్శి ఎస్.రాజేష్, కోశాధికారి పి.సురేష్ తదితరులు మంత్రిని కలసి పలు సమస్యలు విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది ఉద్యోగులు, పెన్షనర్ల తరపున తాము ఈ లేఖ అందజేశామన్నారు. పదేళ్లకోసారి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల జీతభత్యాలు, ఇతర ప్రయోజనాల్ని సమీక్షించేందుకు వేతన సంఘ కమిటీని ఏర్పాటు చేయమని కోరామన్నారు.

అత్యంత ప్రభావవంత నాయకుడు మోదీ



మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దాడి సత్యనారాయణ

దాబాగార్డెన్స్: ప్రధాని మోదీ జన్మదినం బుధవారం అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న సంఘం జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ మాట్లాడుతూ 1950 సెప్టెంబర్ 17న గుజరాత్‌లోని వడ్‌నగర్‌లో సామాన్య కుటుంబంలో జన్మించిన మోదీ తన అసాధారణ నాయకత్వంతో అత్యంత ప్రభావవంతమైన నాయకుల్లో ఒకరిగా ఎదిగారన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ పెబ్బిలి రవికుమార్, కన్వీనర్ ఎన్నేటి తాతారావు, ప్రధాన కార్యదర్శి చిత్రాడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి శరన్నవ రాత్రి ఉత్సవాలు



సాగర గిరి కనకదుర్గమ్మ



అమ్మవారి రాట మహోత్సవం చేపడుతున్న దుర్గా శక్తి పీఠం ప్రతినిధులు

అల్లిపురం: ఈ నెల 22వ తేదీ నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించేందుకు ఆలయాలు ముస్తాబవుతున్నాయి. పది రోజుల పాటు అమ్మవారు వివిధ అవతారాలలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

సాగర గిరి కనకదుర్గమ్మ ఆలయంలో..

యారాడ కొండపై వెలసిన సాగర గిరి కనకదుర్గమ్మ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. 22న బాల దుర్గాదేవి, 23న గాయిత్రీ దేవి, 24న రాజరాజేశ్వరీదేవి, 25న లలితా దేవి, 26న లక్ష్మీదేవి, 27న భువనేశ్వరి దేవి, 28న అన్నపూర్ణాదేవి, 29న సరస్వతీ దేవి, 30న చండీ దేవి, 1న శాకంబరి దేవి, 2న సాగర గిరి కనక దుర్గమ్మ అమ్మవారిగా భక్తులకు దర్శనమివ్వనున్నారు. ప్రతి రోజు ఉదయం పంచామృతాభిషేకాలు, బాల భోగం, రాజభోగం, సాయంత్రం నక్షత్ర హారతి ఉంటాయని తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో..

టూటౌన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ సీవో జీవీ రమాబాయి తెలిపారు. ప్రతి రోజు అమ్మవారు వివిధ అవతారాలలో భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు.

శ్రీ దుర్గాశక్తి పీఠంలో..

అల్లిపురం మెయిన్‌రోడ్డులో వెలసిన శ్రీ దుర్గా శక్తి పీఠంలో ఈ నెల 22 నుంచి దసరా నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తున్నట్లు పీఠం ప్రతినిధి రవిభవానీ తెలిపారు. తొమ్మిది రోజుల పాటు అమ్మవారు వివిధ రూపాలలో దర్శనమివ్వనున్నట్లు తెలిపారు.

మెడికల్ కాలేజీలు ప్రైవేట్‌పరం సిగ్గుచేటు

- పాడేరు మెడికల్ కళాశాల వద్ద ధర్నా విజయవంతం చేయాలి
- వైఎస్సార్‌సీపీ శ్రేణులతో అరకు కాఫీ తాగిన మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి



పార్టీ నాయకులతో కలిసి అరకు కాఫీ తాగుతున్న వాసుపల్లి గణేష్‌కుమార్

దాబాగార్డెన్స్: మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌పరం చేయడం సిగ్గుచేటు అని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. ఆశీల్‌మెట్టలోని తన కార్యాలయంలో నియోజకవర్గ నేతలతో భేటీ అయ్యారు. అనంతరం జీవీఎంసీ గాంధీ పార్కు సమీపాన ఉన్న అరకు కాఫీ స్టాల్ వద్ద పార్టీ శ్రేణులతో వాసుపల్లి కాఫీ తాగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ జిల్లా నాయకత్వంలో ఈ నెల 19న పాడేరు మెడికల్ కళాశాల వద్ద జరగనున్న ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ హయాంలో 17 మెడికల్ కళాశాలల నిర్మాణం జరిగిందని గుర్తు చేశారు. వీటిలో 10 కళాశాలల నిర్మాణానికి రూ.4,500 కోట్లు అవసరమన్నారు. కానీ కూటమి ప్రభుత్వం ఇందుకు నిధులు లేవని చెప్పడం హాస్యాస్పదమన్నారు. విశాఖలో యోగాంధ్ర నిర్వహణకు కూటమి ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా రూ. 400 కోట్లు ఖర్చు చేసిందని దుయ్యబట్టారు. అలాగే అమరావతి వరద నివారణకు 6 వేల కోట్లు, బురద నీరు తోడడానికి వెయ్యి కోట్లు ఖర్చు చేసిందని గుర్తు చేశారు. మెడికల్ కళాశాలల నిర్మాణానికి మాత్రం నిధులు లేవని చెప్పడం అన్యాయమన్నారు. మెడికల కళాశాలలు ప్రైవేట్ పరం చేస్తే పేద, మధ్య తరగతి విద్యార్థులకు సీట్లు రావని ఆందోళన వ్యక్తం చేశారు. మేనేజ్‌మెంట్ కోటాలో యాజమాన్యం సీట్లు అమ్మేసుకుంటుందని విమర్శించారు. అల్లూరి జిల్లా పాడేరులో మెడికల్ కళాశాల వస్తే గిరిజనులు అత్యవసర సమయాల్లో కేజీహెచ్‌కు వచ్చే దుస్థితి తప్పుతుందన్న ముందు చూపుతోనే జగన్ మోహన్‌రెడ్డి మెడికల్ కళాశాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు. కాగా, వైఎస్సార్ సీపీ యువజన, విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 19న జరిగే చలో మెడికల్ కాలేజీ కార్యక్రమం విజయవంతానికి పార్టీ శ్రేణులు, విద్యార్థులు పెద్ద ఎత్తున తరలి రావాలని వాసుపల్లి పిలుపునిచ్చారు. అరకు ప్రాంతంలో జరిగిన అభివృద్ధిని గుర్తు చేసుకుంటూ వైఎస్సార్ సీపీ నేతలతో కలిసి వాసుపల్లి అరకు కాఫీ తాగారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అరకులో కాఫీ పంట సాగు అభివృద్ధికి ఎంతో కృషి జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు లండా రమణ, కనకల ఈశ్వరరావు, పీతల వాసు, దశమంతుల మాణిక్యాలరావు, మహ్మద్ షకీల్, దశమంతుల చిన్ని, ముజీబ్‌ఖాన్, రాంరాజు, ఆరుగుల రాజ్‌కుమార్, ఆకుల శ్యామ్, బొండాడ వెంకట రమణ, సంతోష్, తమ్మినేని శ్రీను తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విశ్వకర్మ జయంతి



ర్యాలీ నిర్వహిస్తున్న గాయత్రి విశ్వకర్మ యువజన సేవా సంఘం ప్రతినిధులు



విశ్వకర్మ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న వాసుపల్లి గణేష్‌కుమార్



విశ్వకర్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అదనపు కమిషనర్లు రమణమూర్తి, ఎస్ఎస్ వర్మ



విశ్వకర్మ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న డీఆర్‌వో భవానీ శంకర్

దాబాగార్డెన్స్: చెంగల్రావుపేటలో ఉన్న గాయత్రి విశ్వకర్మ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం విశ్వకర్మ జయంతి భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సృష్టికి ఆధారమైన విశ్వకర్మ భగవాన్ జయంతిని రెండు దశాబ్దాలుగా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తూ వస్తున్నామని సంఘం ప్రతినిధులు తెలిపారు. ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 17న విశ్వబ్రాహ్మణులే కాక పంచవృత్తిదారులు, ఆయా వృత్తులను నమ్మిన వారు జీవనం సాగిస్తున్నారని చెప్పారు. విశ్వకర్మ జయంతి రైల్వే, ఉక్కు ఫ్యాక్టరీ, ఆర్‌టీసీ గ్యారేజ్, విద్యుత్ సంస్థల్లో ఘనంగా జరుపుకుంటున్నారని, సృష్టికి మూలాధారమైన విశ్వకర్మ భగవానుని జయంతి రాష్ట్ర పండగగా జరిపి, రాష్ట్ర సెలవుగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని చెంగల్రావుపేట పరిసర ప్రాంతాల్లో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు, పంచ వృత్తులు నిర్వహిస్తున్న పలువురు వృత్తిదారులు పాల్గొన్నారు.

విశ్వకర్మకు వాసుపల్లి పూజలు..

కురుపాం మార్కెట్‌లో విశ్వబ్రాహ్మణుల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విశ్వకర్మ జయంతిలో మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ వన్‌టౌన్ ప్రాంతానికి ఓ ప్రత్యేకత ఉందంటే అది విశ్వ బ్రాహ్మణుల వల్లనేనని తెలిపారు. వారు తయారు చేసిన బంగారు ఆభరణాలు కొనుగోలు చేసుకున్న ప్రజలు ఇక్కడి కనకమహాలక్ష్మికి చూపించి ధరించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. విశ్వబ్రాహ్మణుల ఐకమత్యం ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో 38వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు గురజాపు రవి, చేపల నూకరాజు, పెద్దబాబు, పాటుజీ అర్జున్ ప్రసాద్, కోసూరు సురేష్, కిరణ్, పాటుజీ నాని, చిన్ని కృష్ణ, చేపల రాజు, చేపల ప్రసాద్, లండా రమణ, కనకల ఈశ్వర్, పీతల వాసు, దశమంతుల మాణిక్యాలరావు, దశమంతుల చిన్ని, మహ్మద్ షకీల్, ముజీబ్‌ఖాన్, గంగ్గల రామరాజు, ఆరుగుల రాజ్‌కుమార్, ఆకుల శ్యామ్, బొండాడ వెంకటరమణ, సంతోష్, తమ్మినేని శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీలో..

వాస్తు శిల్పి విశ్వకర్మ జయంతి బుధవారం జీవీఎంసీలో నిర్వహించారు. అదనపు కమిషనర్లు డీవీ రమణమూర్తి, ఎస్ఎస్ వర్మ, వ్యయ పరిశీలకుడు వాసుదేవ రెడ్డి పాల్గొని ముందుగా విశ్వకర్మ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అదనపు కమిషనర్లు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జీవీఎంసీలోని వాస్తు శిల్పి విశ్వకర్మ జయంతి నిర్వహించినట్టు చెప్పారు. బ్రహ్మకుమారుడే విశ్వకర్మని, ఆయన ప్రపంచ సృష్టికర్తగా కీర్తింపబడ్డారని పేర్కొన్నారు. శ్రీకృష్ణుడు పాలించిన ద్వారకా నగరాన్ని, పాండవుల కోసం ఇంద్రప్రస్థ రాజభవనంతో పాటు దేవతలకు అనేక అద్భుతమైన ఆయుధాలు తయారు చేశారని, ఆయనను దివ్య వడ్రంగి అని కూడా పిలుస్తారన్నారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో..

మహారాణిపేట: కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో విశ్వకర్మ జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ బీసీ సంఘాల నాయకులు, జిల్లా బీసీ సంక్షేమ శాఖ సిబ్బంది, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి భవానీ శంకర్, విశ్వకర్మ జిల్లా అధ్యక్షుడు శివకోటి శ్రీనివాసరావు, బీసీ సెల్ అధ్యక్షుడు పి. శివప్రసాద్, మహిళా విభాగం అధ్యక్షులు సీతామహాలక్ష్మి, బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శంకరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీసీ సంఘాల ప్రతినిధులు విశ్వకర్మ మహర్షి వారసత్వాన్ని కాపాడుకుంటూ యువతకు సాంకేతిక విద్య, నైపుణ్య అభివృద్ధి అవసరాన్ని ప్రాధాన్యంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.

బాబు మోసాలు ఎండగడతాం



31వ వార్డు ప్రజలకు బాబు మోసాలు వివరిస్తున్న బాపూ ఆనంద్ తదితరులు



కంఠంవారి వీధిలో ప్రచారం చేస్తున్న రమేష్ తదితరులు

దాబాగార్డెన్స్: జీవీఎంసీ 31వ వార్డులో బుధవారం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. వార్డు పరిధి 200వ బూత్‌లో వార్డు అధ్యక్షుడు దొడ్డి బాపూ ఆనంద్ నేతృత్వంలో బూత్ అధ్యక్షుడు పెంటకోట బాబూరావు సారథ్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి బాబు మోసాలు ఎండగట్టారు. ఈ సందర్భంగా వార్డు అధ్యక్షుడు బాపూ ఆనంద్ మాట్లాడుతూ చంద్రబాబు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలు కానివని, ప్రజలను మోసగించడానికి పెట్టిన అబద్ధాలన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి కరపత్రంలో ఉన్న పలు అంశాలు ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పెంటకోట నాగరాజు, రాముూ మాస్టారు, కాండ్రేగుల నాయుడు, పిలకా మోహన్, త్రినాథ్, విశాల్, గోవింద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

33వ వార్డులో..

అల్లిపురం: జీవీఎంసీ 33వ వార్డు అధ్యక్షుడు ముత్తాబత్తుల రమేష్ ఆధ్వర్యంలో బుధవారం 63వ బూత్ కంఠంవారి వీధిలో గడప గడపకు వెళ్లి బాబు ప్రజల్ని మోసం చేస్తున్న విధానం వివరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పచ్చిరపల్లి రాము, హేమలక్ష్మి, బూరిల చిన్న, కొల్లు సత్యవతి, పీవీఎస్ రెడ్డి, బి.శ్రీనివాసరావు, కృష్ణారెడ్డి, సిద్దేశ్వర రావు, ధర్మారావు, అనంతలక్ష్మి, శ్రావణి, అభి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పోర్టులో స్వచ్ఛత పక్వాడా

మహారాణిపేట: విశాఖ పోర్టు అథారిటీలో బుధవారం స్వచ్ఛత పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈనెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. బుధవారం సాంబమూర్తి ఆడిటోరియంలో, అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్(ఏవోబీ)లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వీపీఏ ఉపాధ్యక్షుడు దుర్గేష్ కుమార్ దుబే, అన్ని విభాగాధిపతులు, ఉద్యోగులతో కలిసి స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఏవోబీ పరిసరాలలో ప్రత్యేక స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోర్ట్ కార్యదర్శి టి. వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు



పరిసరాలను శుభ్రం చేస్తున్న పోర్టు సిబ్బంది

కబడ్డీ పోటీల విజేత విశాఖ మహిళా కళాశాల



విజేతగా నిలిచిన జట్టు సభ్యులతో ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుల, అధ్యాపకులు

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల నిర్వహణలో భాగంగా కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం జోనల్ స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విజేతగా సీహెచ్ ఊర్మిలా అండ్ టీం నిలిచింది. రన్నరప్‌గా డాక్టర్ వీఎస్ కృష్ణా కళాశాలకు చెందిన సీహెచ్ భాగ్యశ్రీ అండ్ టీం గెలిచింది. మూడవ స్థానంలో చీపురుపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన వి.లావణ్య అండ్ టీం నిలిచింది. పోటీలు ప్రారంభించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల మాట్లాడుతూ క్రీడల ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, శారీరక దారుఢ్యం, స్ఫూర్తి, ఆరోగ్యకరమైన పోటీ పెంపొందుతుందన్నారు. అనంతరం విజేతలకు ప్రిన్సిపాల్ చేతుల మీదుగా మెడల్స్ అందజేశారు.

కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ కబడ్డీ వంటి సాంప్రదాయ ఆటలు మన సంస్కృతిని ప్రతిబింబించడంతో పాటు విద్యార్థుల భవిష్యత్‌లో ఉన్నత స్థాయి పోటీలకు మార్గం చూపుతాయన్నారు. కార్యక్రమంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఉపాధ్యాయులు, సిబ్బంది, స్పోర్ట్స్ టీం సభ్యులు తదితరులు పాల్గొంది.

విద్యార్థుల భాగస్వామ్యంతోనే ప్రగతి



విద్యార్థినికి జ్ఞాపిక అందజేస్తున్న అతిథులు

అల్లిపురం: మై భారత్ కార్యకలాపాల్లో విద్యార్థులు భాగస్వాములు కావాలని మిసెస్ ఏవీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణకుమారి విజ్ఞప్తి చేశారు. వికాస్ దినోత్సవం సందర్భంగా మై భారత్, సమసరియా ఫౌండేషన్ సంయుక్తంగా కాలేజీలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. సభకు అధ్యక్షత వహించిన ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ ఎ. అర్చన మాట్లాడుతూ మై భారత్ వికాస్ దివస్ వేడుకలు కళాశాలలో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. మై భారత్ డిప్యూటీ డైరెక్టర్ జి.మహేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం యువత కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తుందన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రెసిడెంట్ అవార్డు గ్రహీత ఆర్. లీలా ప్రసాద్ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ ద్వారా సమాజానికి సేవ చేసే అవకాశం ఉందన్నారు. స్కూల్ ఆఫ్ జర్నలిజం అండ్ కమ్యూనికేషన్ చైర్మన్ ఎన్.నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రధాని మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత సాధించిన విజయాలు, ప్రవేశపెట్టిన సంస్కరణలు, జాతీయ అంతర్జాతీయ సంబంధాల గురించి వివరించారు. కార్యక్రమం అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు మై భారత్ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.